epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 120 | ఆదివారం | 29.09.2024

## పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా 2





## కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య 3లో..



## పార్టీకి ద్రోహం చేయలే

- కాంగ్రెస్ సీనియర్ నేతల వెల్లడి 3లో..



మన చౌరాస్తా
2
29.09.2024 ఆదివారం
epaper.manachourasta.com





# విద్యార్థి దశ కీలకమైంది

- **పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి**
- **కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా**



**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థి దశ చాలా కీలక మైనదని, మంచి భవిష్యత్ ఉండాలంటే ప్రతి విద్యార్థి చదువు పైన దృష్టి సారించాలని కలెక్టర్ షేక్ రిజ్వన్ బాషా అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాలేజీ పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న మౌలిక వసతుల గురించి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి విద్యార్థులును ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సంస్థల్లో చాలా అనుభవం ఉన్న టీచర్లు, లెక్చరర్లు ఉంటార న్నారు. విద్యార్థులు ప్రతి రోజూ కాలేజీకి వచ్చి వారు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటే ప్రతీ పరీక్షల్లో మంచి మార్కులు వస్తాయన్నారు. వచ్చే పరీక్ష లలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంటారని, మీరు బాగా చదువుకొని ఉన్నతమైన స్థానంలో ఉంటే వారు ఎప్పటికీ సంతోషంగా ఉంటారన్నారు. కార్యక్రమం లో కాలేజ్ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేబీస్ వ్యాధిపైన అవగాహన కలిగి ఉండాలి

సెప్టెంబర్ 28 ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కుక్క కాటు వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్ పైన ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని.... కుక్క కరిచిన వెంటనే చేపించుకోవలిసిన ట్రీట్మెంట్ పద్ధతి పైన అవగాహన కలిగి ఉం డాలన్నారు. మనుషులకు ఉన్నట్టే... కుక్కలకి, ప్రతీ జీవికి జీవించే హక్కు ఉందన్నారు. మన ఇంటి పరిసరాల చుట్టూ ఎన్ని కుక్కలు ఉన్నాయి..అవి ఎలాంటి పరిస్థితి లో ఉన్నాయనేది గమనించాలని .... దారి వెంబడి వెళ్ళేటప్పుడు అలర్ట్ గా ఉండాలన్నారు. మార్కెట్ కి గాని, కిరాణం షాప్ కి గాని ఇంట్లో నుండి ఎవరి నైనా పంపించే ముందు సరైన వ్యక్తి ని పంపివ్వాలన్నారు. జిల్లాలోని అన్నీ పశు వైద్య శాలలో రేబిస్ వ్యాధి టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కుక్కలను పెంచుకునే వారు వాటిని పెంచుకుంటున్నందుకు లైసెన్స్ తీసుకోవాలని... వాటికీ సమయానికి వ్యాక్సిన్ వేపించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా పశు వైద్య అధికారి రాధాకిషన్ ,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పావని, వెటర్నరీ డాక్టర్ లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆదాయం పెంపుపై
# దృష్టి పెట్టండి

**బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

**హనుమకొండ, మన చౌరాస్తా:** రెవెన్యూ అధికారులు ఆదాయ పెంపు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో భువన్ ఆప్ లో సర్వే డేటా నమోదు పురోగతి పై ఏర్పాటు చేసిన సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ ఐ ల వారిగా కేటాయించిన డివిజన్ ల ప్రాతిపదికన భువన్ యాప్ లో నమోదు చేసిన అసెస్మెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సి జి జి) లో బల్దియా పరిధిలో ఉన్న 66 డివిజన్ల అసె స్మెంట్ ల సమాచారం నమోదు చేయడం జరిగిందని అట్టి సమాచా రానికి భువన్ అప్ లో నమోదు చేసిన సమాచారం తో సరి పోల్చుకొని చూడాలని ఆర్ ఐ లకు సూచించారు. భువన్ ఆప్ లో గల సమాచారం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అప్డేట్ (నవీకరణ) చెందుతుందని ఇట్టి విషయంపై ఆర్ ఐ లకు అవగాహన అవసరం అని ఏదైనా సమా చారాన్ని నవీకరించే క్రమంలో అందులో పేర్కొన్న విధంగా కాలమ్స్ లో సమగ్ర సమాచారాన్ని పూరించాలని (అందించాలని)ప్రభుత్వం 2007 లో అందజేసిన గెజిట్ ఉత్తర్వుల ప్రకారం నిబద్ధతత తో అసె స్మెంట్ ల సమాచార నమోదు చేపట్టి రెవెన్యూ ఆదాయం పెంపు పై ఆర్ ఐ లు దృష్టిసారించాలని నమోదిత అసెస్మెంట్ ల సమాచారాన్ని ఆర్ ఐ లు ర్యాండం గా క్షేత్ర స్థాయి లో పర్యటించి (తనిఖీ చేసి) సి జీ జీ తో పాటు భువన్ ఆప్ లో ఖచ్చితం గా నమోదు జరిగిందో లేదో పరిశీ లించాలని బల్దియా వ్యాప్తం గా 2979 అసెస్మెంట్ ల దరఖాస్తు ల అసె స్మెంట్ ల సమాచారం భువన్ సి జీ జీ కి సరిపోలడం (మ్యాచ్) లేదని సంబంధిత ఆర్ ఐ లు క్షేత్ర స్థాయి లో పరిశీలించి పి టి ఎం నంబర్ ద్వారా దృవీకరణ జరిపి సంబంధిత ప్రాంత డిప్యూటీ కమిషనర్లచే ఎడిట్ జరిగేలా చూడాలని కమీషనర్ అన్నారు. అనంతరం అప్డేట్డ్ (నవీకరణ) ఫ్రోఫార్మా లో అసెస్మెంట్ సమాచార నమోదు తీరును అధికారులు ఆర్ ఐ లకు దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్ పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ ,ఆర్ వోలు యూసిఫొద్దీన్ ,శ్రీనివాస్ ,షహజాదీ బేగం ఐటి మేనేజర్ రమేష్ ఆర్ ఐ లు తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లు తరలిస్తే సహించం

- **ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



**చేర్యాల, మన చౌరాస్తా :** తపస్ పల్లి రిజర్వాయర్ ప్రతిపాదిత ఆయకట్టు పరిధిలోని చేర్యాల, కొమరవెల్లి, మద్దూర్, దూల్మిట్ట, బచ్చన్నపేట మండలంలో ని చెరువులను గోదావరి జలాలతో నింపిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని పంపింగ్ చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఈ ప్రాంత రైతాంగం వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని ఈ ప్రాంత చెరువుల నింపిన తర్వాత ఇతర ప్రాంతాలకు పంపింగ్ చేసుకోవడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రభుత్వ విప్ బీరుల ఐలయ్య ఆలేరు ప్రాంతంలోని చెరువులను నింపేందుకు తపస్పల్లి రిజర్వాయర్‌ను సందర్శించి మెయిన్ కాల్వల వద్ద ఉన్న గెట్ వాళ్లను కార్యకర్తలతో విప్పించడం సరికాదన్నారు. ఈ ప్రాంత చెరువులను గతంలో ఏ విధంగా నింపారో దేవాదుల అధికారులు తక్షణమే స్పందించి చేర్యాల ప్రాంత చెరువులో నింపాలని లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు అన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి




**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో రాము అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రీడోత్సవాల ముగింపు సమావేశం శనివారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటరెడ్డి, పాఠశాల పీడీ జ్యోతి, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Local News



# కేయూ భూములను కాపాడాలి

- **ఏబీవీపీ నాయకుల డిమాండ్**

**వరంగల్ , మన చౌరాస్తా :** కాకతీయ యూనివర్సిటీ 229 సర్వే నెంబరు భూములను ఆక్రమించి కొందరు యూనివర్సిటీ ఉద్యోగులు తో పాటు మరికొందరు ఇండ్లు కట్టుకొని ఉన్నారని విజిలెన్స్ , రెవెన్యూ వారి విచారణలో తేలినందున ఎమ్మార్వో రిపోర్టు ఆధారంగా చేసుకుని మున్సిపల్ కమిషనర్ వెంటనే కేయూ భూమిలో కట్టుకున్న ఇండ్లను కూల్చివేసి కేయూ భూములను కాపాడాలని ఏబీవీపీ నాయకులు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ అశ్విన్ తానాజీ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ ... ఇటీవల 229 సర్వే నంబర్లు ఫిజికల్ బౌండరీ ఫిక్సింగ్ కొరకు సర్వే చేయడం జరిగిందని అన్నారు. ఈ సర్వేలో 229 సర్వేనెంబర్ లో కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ అసిస్టెంట్ రిజిస్టర్ పెండ్లి అశోక్ బాబు తో పాటు మరికొందరు ఇండ్లు కట్టుకొని ఉన్నారని రిపోర్టులో తేలడంతో కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఎమ్మార్వో రిపోర్టును ఆధారంగా చేసుకుని వరంగల్ మున్సిపల్ కమిషనర్ కు వారి ఇల్లు కూల్చివేతకు సంబంధించి ఇటీవల లెటర్ ను ఇవ్వడం జరిగిందని అన్నారు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు 229 సర్వే నంబర్లు ఆక్రమించుకున్న వారికి ఎటువంటి నోటీసులు జారీ చేయలేదని తెలిపారు. కేయూ భూమిలో ఆక్రమించి ఇల్లు కట్టుకున్న వాళ్లందరికీ వెంటనే నోటీసులు జారీ చేసి ఆ ఇండ్లను కూల్చివేయాలని మున్సిపల్ కమిషనర్ గారిని కోరడం జరిగిందని తెలిపారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి టౌన్ ప్లానింగ్ అధికారి కి వినతి పత్రాన్ని పంపించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరడం జరిగిందని మాచర్ల రాంబాబు ఈ సందర్భంగా తెలిపారు. వినతి పత్రము ఇచ్చిన వారిలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, యూనివర్సిటీ ఇంచార్జి నిమ్మల రాజేష్, యూనివర్సిటీ సెక్రెటరీ శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు కందుగుల రాజు, గట్టు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# మేం పార్టీకి ద్రోహం చేయలే..

- **కొమ్మూరి వచ్చాకే వర్గపోరు మొదలైంది**
- **కాంగ్రెస్ సీనియర్ నేతలు వేమళ్ల, ఎర్రమల్ల, కంచె**



**జనగామ, మన చౌరాస్తా :** తాము కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నాం.. తల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసే నీచ సంస్కృతి తమకు లేదని సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధి చెందిన కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో తాము కాంగ్రెస్ పార్టీకి కానీ, ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థికి కానీ ద్రోహం చేయలేదని, ప్రతిపక్ష నాయకుని వద్ద డబ్బులు తీసుకోలేదని తడిబట్టలతో ప్రమాణం చేయడానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. తాము కొమ్మూరి లాగా పది పార్టీలు మారలేదన్నారు. కొమ్మూరికి బీజేపీ నుండి పోటీ చేస్తే డిపాజిట్ కూడా దక్కలేదనే విషయం అందరికీ తెలుసు అన్నారు. కొమ్మూరి తమపై అర్థరహితమైన ఆరోపణలు మానుకోవాలన్నారు. ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసిన తమను కలుపుకుని పోవాల్సిన కొమ్మూరి తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదన్నారు. కొమ్మూరి వచ్చినప్పటి నాటి నుంచే జనగామలో వర్గపోరు మొదలైందన్నారు. నియోజకవర్గంలో కొమ్మూరి ఫ్యాక్షన్ రాజకీయాలను చూస్తున్నారని మండిపడ్డారు. కొమ్మూరి బీసీలను ఆలణచి వేయాలని చేస్తున్నారని ఆరోపించారు. యాదవులపై అణగ తొక్కితే నాడు దొడ్డి కొమురయ్య తిరగబడ్డ గడ్డ జనగామ అనే విషయం కొమ్మూరి మరువద్దన్నారు. కొమ్మూరి నాయకత్వంలో పనిచేయడానికి ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఆయన కొందరి చెప్పుడు మాటలు విని పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాడని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు కొత్త కరుణాకర్ రెడ్డి, సుంకరి శ్రీనివాసరెడ్డి, మధు, వేముల్ల మల్లేషం, చిర్ర హన్మంత రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జాయ మల్లేశ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**పరకాల, మన చౌరాస్తా :** రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా ఎగరాల్సింది కాంగ్రెస్ జెండా మాత్రమేనని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండానే ఎగరాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలలో నిండు మనసుతో ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు జరిగినవి సెమీ ఫైనల్స్ మాత్రమేనని.... ఇప్పుడు జరగబోయే ఎన్నికలే ఫైనల్స్ అని అన్నారు. ఆ ఫైనల్స్ లో గెలవాల్సింది కాంగ్రెస్ పార్టీయే అని అందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని తెలిపారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికే అవకాశాలు దక్కుతాయని అన్నారు. రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రి చేసే వరకు ప్రతీ కార్యకర్త విశ్రమించకుండా కృషి చేయాలని కోరారు. త్వరలోనే కుల గణన జరగనుందని, జనాభా ప్రాతిపదికనే రిజర్వేషన్లు అమలు జరుగుతుందని వెల్లడించారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధికి నా వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్క్సిజమే పేదరిక
# విముక్తికి మార్గం

- **సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలంలోని శభాష్‌గూడెం సిపిఎం పార్టీ గ్రామ శాఖ మహాసభ దాసరి కనకయ్య అధ్యక్షతన ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ కులాల పేరుతో మతాల పేరుతో ప్రైవేటీకరణ పేరుతో మానవ మనుగడను హరించే విధంగా నేడు బడా కార్పొరేట్లు ప్రభుత్వాల అండతో కోటీశ్వరులను శతకోటిశ్వర్లుగా అందలం ఎక్కుతూ వీరు అనుసరించే విధానాల వల్ల పేదలు మరింత పేదలుగా మారుతున్నారని ఇది దేశ ప్రగతికి ప్రజలకు ఆటంకంగా తయారైందని వీటన్నిటికీ మార్క్సిజమే సరైన మార్గమని అన్నారు. నేడు ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలే అని ఆ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలపై రైతులను వ్యవసాయ కూలీలను గ్రామీణ పేదలను కలుపుకొని ఐక్య సంఘటనతో మార్క్సిజం వెలుగులో పోరాటాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం నూతన పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా దండ్ల రమేష్, సోషల్ మీడియా గ్రామ బాధ్యునిగా బొడ్డు ప్రకాష్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మోకు దేవేందర్ రెడ్డి, నాగపురి కనకయ్య గొర్రె శ్రీనివాస్, ,ఇస్మాయిల్, ఆముదాల రంజిత్ రెడ్డి, బాలు కొమురయ్య సురేష్, రాజు, కిరణ్, మౌనిక, లలిత తదితరులు పాల్గొన్నారు.



# స్టైలిష్ సమంత

మన చౌరాస్తా, సినిమా : చాలా కాలం తర్వాత ఇప్పుడిప్పుడే మరోసారి అడియన్స్ ముందుకు వస్తుంది హీరోయిన్ సమంత. అటు సోషల్ మీడియాలో వరుస ఫోటోషూట్స్ షేర్ చేస్తున్న సామ్.. ఇటీవలే సిటాడెల్ వెబ్ సిరీస్ టీమ్ మెంబర్స్‌తో సందడి చేసింది. సిటాడెల్ వెబ్ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రాతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చింది. అలాగే తాజాగా సినీరంగంలో హీరోయిన్స్ ప్రతిష్టాత్మకంగా భావించే ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ అందుకుంది. ఈ శుక్రవారం దుబాయ్ వేదికగా జరిగిన ఐఫా 2024 వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందుకుంది సామ్. దీంతో ఆమెకు బాలీవుడ్, టాలీవుడ్ స్టార్స్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే గత నాలుగు రోజులుగా స్టైలీష్ లుక్స్ లో వరుస ఫొటోషూట్స్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది సామ్. ఈవెంట్స్, పార్టీలలో తన స్టైల్‌తో అందరిని ఆశ్చర్యపరుస్తుంది. ఇటీవలే ఓ ఈవెంట్‌లో సమంత తన సన్నిహితురాలు క్రేషా బజాజ్ రూపొందించిన అద్భుతమైన పాస్టెల్ గ్రీన్ కో-ఆర్డ్ సెట్‌తో అభిమానులను అలరించింది. గ్రీన్ స్టైలీష్ డ్రెస్సుకు తగినట్లుగా బంగారు చెవిపోగులనూ ధరించి మరింత స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. ఇక తన లుక్ కు తగినట్లుగా విలాసవంతమైన బల్గారీ సర్పెంటీ వాచ్ ధరించింది. ఈ వాచ్ సామ్ లుక్ ను మరింత అందంగా మార్చేశాయి. దీంతో ఆ వాచ్ ధర గురించి తెలుసుకోవడానికి నెట్టింట సెర్చింగ్ స్టార్ట్ చేశారు ఫ్యాన్స్. నివేదికల ప్రకారం సమంత ధరించిన లగ్జరీ బల్గారీ వాచ్ ధర రూ.45.5 లక్షలు అని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. సామ్ ఇటీవలే లండన్‌లోని సిటాడెల్ వరల్డ్ పార్టీకి హాజరయ్యారు. అక్కడ ఆమె మరోసారి అందరి లుక్ ను తనవైపు తిప్పకుంది. ఈసారి క్రేషా బజాజ్ రూపొందించిన అధునాతన నేవీ-బ్లూ డ్రెస్ లో కనిపించింది. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సామ్.. సినిమాలు తగ్గించింది. నిత్యం యోగా, మెడిటేషన్ చేస్తూ తన ఫాలోవర్లకు సైతం ఆరోగ్య సూచనలు ఇస్తుంది.



